క్లుప్తంగా

ఫుట్‌బాల్ పోటీలు ప్రారంభం

విశాఖ స్పోర్ట్స్: విశాఖ జిల్లా ఫుట్‌బాల్ వార్షిక లీగ్ పోటీలు సోమవారం మున్సిపల్ స్టేడియంలో ప్రారంభమయ్యాయి. స్థానిక జట్లు ఐదు గ్రూప్‌లుగా ఈ పోటీల్లో తలపడనున్నాయి. విశాఖ ఫుట్‌బాల్ అలియెన్స్, వెల్ఫేర్ సంఘం ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహిస్తున్నారు. తొలిరోజు జరిగిన పోటీలో స్టార్ ఫ్లెక్ స్పోర్టింగ్ జట్టు 4–0 గోల్స్ తేడాతో గోల్డెన్ ఈగల్ జట్టుపై విజయం సాధించింది. ఇరుజట్ల ఆటగాళ్లను కార్పొరేటర్ భాస్కరరావు పరిచయం చేసుకున్నారు. పోటీలను సంఘం ప్రతినిధులు చినబాబు, సన్నీ, రామకృష్ణ తదితరులు పర్యవేక్షిస్తున్నారు.

సంప్రదాయ కళలను ప్రోత్సహించాలి

దాబాగార్డెన్స్: సాంప్రదాయ కళలను ప్రోత్సహించాలని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్ పిలుపునిచ్చారు. మిరాకిల్ మ్యూజికల్ క్లబ్ ఆధ్వర్యంలో దాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో సోమవారం నూతన సంవత్సరాన్ని స్వాగతిస్తూ టాలెంట్ హంట్ పేరిట సంగీతం, గాత్రం, కీబోర్డు ప్లే, గిటార్ ప్లే తదితర అంశాలపై పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ సాంప్రదాయ కళలను ప్రోత్సహించాలన్నారు. కళలు మన భారతదేశ వైభవానికి ప్రతీకలని పేర్కొన్నారు. అనంతరం ప్రముఖుల చేతుల మీదుగా ప్రతిభ కనబరచిన కళాకారులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సన్‌మూర్తి, మిరాకిల్ మ్యూజికల్ క్లబ్ వ్యవస్థాపకుడు మహ్మద్ షకీల్, విశ్రాంత ఏడీసీపీ మహ్మద్ ఖాన్, తదితరులు పాల్గొన్నారు.


సమస్యలు పరిష్కరించాలని వినతి



జీవీఎంసీ కమిషనర్ సంపత్ కుమార్‌కు వినతిపత్రం అందిస్తున్న డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, ముస్లిం సంఘ నాయకులు

సీతమ్మధార: నూర్ భాషా ముస్లింల శ్మశాన వాటికల్లో సదుపాయాలు కల్పించాలని, కబరిస్తాన్లు లేని చోట స్థలం కేటాయించి నిర్మాణాలు చేపట్టాలని డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, షేక్ బురాన్, షేక్.నాగూర్, షేక్.రహిమాన్ పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్‌తో కలిసి నూర్ భాషా ముస్లిం సంక్షేమ సేవా సంఘం ప్రతినిధులు జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్ కుమార్‌కు వినతిపత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ మదర్సా స్కూలుకు ఉర్దూ టీచర్లను నియమించాలని, మటన్ వ్యాపారం చేస్తున్న వ్యాపారుల కోసం కబేళాలు తగరపువలస, పెందుర్తి, ఆరిలోవలో ఏర్పాటు చేయాలని కోరారు. షాదీఖానాలు నిర్మించాలని కోరారు.

నర్సింగ్ సూపరింటెండెంట్‌కు సత్కారం



రమణమ్మను సన్మానిస్తున్న కేజీహెచ్ సూపరింటెండెంట్ శివానంద్, తదితరులు

మహారాణిపేట: కేజీహెచ్ నర్సింగ్ విభాగంలో గ్రేడ్ – 2 నర్సింగ్ సూపరింటెండెంట్‌గా పనిచేసి సోమవారం రిటైర్ అయిన ఆర్.హెచ్.వి.రమణమ్మను కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్ సన్మానించారు. కేజీహెచ్ నర్సింగ్ విభాగంలో ప్రభుత్వ నర్సుల సంఘం జిల్లా అధ్యక్షురాలు గంగాభవానీ ఆధ్వర్యంలో నిర్వహించిన వీడ్కోలు కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. అడ్మినిస్ట్రేటర్ బి.వి.రమణ, అసిస్టెంట్ డైరెక్టర్ పి.ఎస్.అప్పారావు, నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్ వన్ పద్మావతి, ఆర్‌ఎంవో డాక్టర్ రాజేష్, అసోసియేషన్ అధ్యక్షురాలు గంగా భవానీ, ప్రధాన కార్యదర్శి జీవీఎస్ వరలక్ష్మి, ఉపాధ్యక్షురాలు ఎం.ఇందిర తదితరులు పాల్గొన్నారు.

హడలెత్తిస్తున్న కుక్కలు



- పాతనగరంలో గుంపులుగా స్వైర విహారం
- శస్త్రచికిత్సలు చేసి వదిలేస్తున్న అధికారులు
- దూర ప్రాంతాలకు తరలింపులో నిర్లక్ష్యం



ఇప్పటికి ముగ్గురిని కరిచిన కుక్క ఇదే



పాత నగరంలో గుంపుగా సంచరిస్తున్న కుక్కలు

దాబాగార్డెన్స్: పాతనగరంలో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. స్థానికులు, వాహనదారులు రాకపోకలు సాగించాలంటే హడలెత్తిపోయేలా వెంబడిస్తున్నాయి. చీకటి పడిందంటే ఇంటికి చేరేందుకు బిక్కుబిక్కుమంటూ వెళ్తున్నారంటే పరిస్థితి ఎంత భయానకంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. జీవీఎంసీ 29వ వార్డుతో పాటు దక్షిణ నియోజకవర్గ పరిధి పలు వార్డుల్లో ఇటీవల రోడ్లపై కుక్కలు గుంపులుగా తిరుగుతూ స్థానికులను హడలెత్తిస్తున్నాయి. గత వారం రోజుల్లో పలువురు స్థానికులు, పాదచారులపై దాడి చేసి గాయపరిచాయి. గాయాలపాలైన వారు ఆస్పత్రుల చుట్టూ వ్యాక్సిన్స్ కోసం తిరుగుతున్నారు. ఇటీవల కాలంలో నియోజకవర్గ పరిధి అనేక వార్డుల్లో కుక్కలు గుంపుగా సంచరిస్తున్నాయి. పిల్లలు, పెద్దలను పరుగులు పెట్టించి మరీ దాడి చేస్తున్నాయి. డిబ్బల పాలెంలో పలువురు పాదచారులు, వాహన చోదకులపై దాడి చేశాయి. గుంపులుగా సంచరిస్తుండడంతో రోడ్డు పైకి వచ్చేందుకు జనాలు జంకుతున్నారు. ఈ ప్రాంతంలో పాఠశాలలు ఎక్కువగా ఉండడం, కేజీహెచ్‌కు, కోర్టుకి, ఇతర ప్రభుత్వ కార్యాలయాలు, బజార్లకు వెళ్లేటప్పుడు కుక్కలను చూసి భయపడుతున్నారు. ఈ సమస్యపై ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. కుక్కలను తీసుకెళ్లి వాటికి ఆపరేషన్లు చేస్తున్న సిబ్బంది... తిరిగి వాటిని పాతనగరంలోనే వదిలేస్తున్నారని లబోదిబోమంటున్నారు. దూర ప్రాంతాలకు తీసుకెళ్లి వదలడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు వాపోతున్నారు.

చీకటి పడితే రాలేకపోతున్నాం



చీకటి పడితే బైక్‌పై రోడ్డు మీదకు రావాలంటే కుక్కలతో భయమేస్తోంది. విధులు ముగించుకుని ఇంటికి చేరే సమయంలో కుక్కలు గుంపుగా దాడి చేస్తున్నాయి. వాటి నియంత్రణకు అధికారులు చర్యలు తీసుకోవాలి.

–బండారు లోకేష్‌కుమార్, డిబ్బలపాలెం

తూతూమంత్రంగా చర్యలు

కుక్కలకు శస్త్ర చికిత్సల అనంతరం తిరిగి అదే ప్రాంతంలో వదిలేస్తున్నారు. వాటి నియంత్రణకు జీవీఎంసీ అధికారులు సక్రమంగా చర్యలు చేపట్టడం లేదు. తూతూ మంత్రంగా చర్యలు చేపట్టి వాటిని తిరిగి అదే ప్రాంతంలో వదిలేస్తుండడంతో నగరవాసులు ఇబ్బంది పడుతున్నారు. సమస్య తీవ్రతను గుర్తించి అధికారులు చర్యలు చేపట్టాలి. ఈ విషయమై స్థానిక సచివాలయంలో ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కూడా ఫిర్యాదు చేశాం.

– శ్రీనివాసరాజు, మహారాణిపేట

వెంబడించి కరిచేసింది



నేను పాతనగరంలో ఇస్త్రీ చేస్తుంటాను. గత 4 దశాబ్దాలుగా ఈ ప్రాంతంలోనే ఇస్త్రీ వేసుకుంటూ ఆ వచ్చే ఆదాయంతో జీవనం సాగిస్తున్నా. రెండు రోజుల కిందట ఇస్త్రీ చేసేందుకు దుస్తుల కోసం ఓ ఇంటికి వెళ్లాను. అక్కడ ఓ కుక్క నన్ను వెంబడించి కరిచేసింది. కేజీహెచ్‌కి వెళ్తే రెండు ఇంజక్షన్లు చేశారు. ఇంకా ఇంజక్షన్లు చేయించుకోవాలి. చాలీచాలని ఆదాయంతో బతుకుతున్న నాకు ఇదో ఆర్థిక భారంగా మారింది.

– శంకరరావు, ఇస్త్రీ బండి నిర్వాహకుడు

కులగణన గడువు పెంపునకు వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించి వస్తున్న రెల్లి కుల సంఘాల నాయకులు

మహారాణిపేట: ఎస్సీ వర్గీకరణలో భాగంగా కులగణన గడువును మరో రెండు వారాలు పెంచాలని రెల్లి సంఘానికి చెందిన పలువురు నాయకులు కోరారు. వారు సోమవారం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ప్రస్తుతం ఇచ్చిన గడువు సరిపోదని, మరో రెండు వారాలు పెంచాలని కలెక్టర్‌ను కోరుతూ ఐదు రెల్లి వీధుల సంఘం ఉపాధ్యక్షుడు దశమంతుల చిన్న, గౌతమ్ బాబా రెల్లి సేవా సంఘం అధ్యక్షుడు సింగంపల్లి కల్యాణ ముని, విశాఖ జిల్లా పారిశ్రామిక ప్రాంతం సంక్షేమ సేవా సంఘం గౌరవ అధ్యక్షుడు కొట్నాన రవి తదితరులు కలెక్టర్‌కు సమర్పించిన లేఖలో కోరారు.

ముగిసిన వింటర్ చెస్ క్యాంప్



విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న ట్రైనర్ కేశవానంద

సీతమ్మధార: ఆశీల్‌మెట్ట ఎసెంట్ జూనియర్ కళాశాలలో నాలుగు రోజుల పాటు నిర్వహించిన అంతర్జాతీయ ప్రమాణ స్థాయి చదరంగ శిక్షణ (వింటర్ చెస్ క్యాంపు) సోమవారం ముగిసింది. శిబిరంలో పాల్గొన్న 53మంది క్రీడాకారులకు ఫిడే ట్రైనర్ కేశవానంద 50 గంటల పాటు 4 రోజుల ఇంటెన్సివ్ శిక్షణ అందించారు. క్యాంప్‌లో పాల్గొన్న ప్రముఖ చెస్ క్రీడాకారులు అఖిల్ ప్రసాద్, జి.రవి కృష్ణ, ఎం.వి.రుత్విక్‌లను సోమవారం ఘనంగా సత్కరించారు. శిబిరంలో ఉత్తమ ప్రదర్శన కనబరిచిన వారికి అసెంట్ క్లాసెస్ ఎండీ డాక్టర్ ఉమాధర్ పట్నాయక్ , స్కూల్ ఆఫ్ వండర్ కిడ్స్ ప్రిన్సిపాల్ శర్వాణి, డెర్మటాలజిస్ట్ డాక్టర్ సిద్ధార్థ్, ప్లాస్టిక్ సర్జన్ శ్రీహర్ష బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో యులోజికా సీఈవో రాజు చిత్రాడ, విజయలక్ష్మి పతకాలు, సర్టిఫికెట్లు అందజేశారు.

కుటుంబం చెంతకు దివ్యాంగురాలు



జయపు వరలక్ష్మిని సోదరుడికి అప్పగించిన ఏయూటీడీ కార్యదర్శి వాసు

సీతమ్మధార: మనస్తాపంతో ఇంటి నుంచి వచ్చేసిన దివ్యాంగురాలిని ఏయూటీడీ కార్యదర్శి సోమవారం కుటుంబ సభ్యులకు అప్పగించారు. కన్న తల్లే అవిటిదానివని పదే పదే అనడంతో తట్టుకోలేక జయపు వరలక్ష్మి (28) ఇటీవల వైజాగ్ వచ్చేసింది. రాజమండ్రి దివాన్ చెరువు ప్రాంతానికి చెందిన వరలక్ష్మికి పోలియో రావడంతో రెండు కాళ్లు ఒంకరపోయి నడవలేని స్థితికి చేరుకుంది. ఇంటి నుంచి వచ్చేసిన ఆమె రైల్వే స్టేషన్‌లో సంచరిస్తుండడంతో గమనించిన ఆర్‌పీఎఫ్ పోలీసులు ఇచ్చిన సమాచారంతో ఏయూటీడీ సిబ్బంది షెల్టర్‌కు తీసుకొచ్చి ఆశ్రయం ఇచ్చారు. ఈ క్రమంలో ఆ అమ్మాయి తండ్రి మీద ప్రేమతో కుటుంబ సభ్యులకు ఫోన్ చేయడంతో సోదరుడు రాకేష్ రాజమండ్రి నుంచి విశాఖ వచ్చాడు. రాకేష్ జరిగినదంతా చెప్పడంతో వరలక్ష్మికి నచ్చజెప్పి క్షేమంగా రాజమండ్రి పంపించామని ఏయూటీడీ కార్యదర్శి వాసు తెలిపారు.

పీజీఆర్‌ఎస్‌కు 21 వినతులు



వినతులు స్వీకరిస్తున్న జోన్ - 4 జెడ్సీ మల్లయ్యనాయుడు

మహారాణిపేట: మహారాణిపేట తహసీల్దారు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 21 వినతులు వచ్చాయి. ఇన్‌చార్జి తహసీల్దార్ జిలానీ అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించారు. వీటిలో కుల ధ్రువీకరణ కోసం 6, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ కోసం 7, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం 8 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఈ అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని ఇన్‌చార్జి తహసీల్దారు జిలానీ సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, వీఆర్వోలు పాల్గొన్నారు.

జోన్–4 కార్యాలయంలో..

జగదాంబ: సమస్యల పరిష్కారానికి పీజీఆర్‌ఎస్ కార్యక్రమాన్ని ప్రజలు వినియోగించుకోవాలని జీవీఎంసీ జోన్–4 జోనల్ కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు కోరారు. జోన్–4 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్‌ఎస్ కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీజీఆర్‌ఎస్‌లో సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఏఎంవోహెచ్ కృష్ణంరాజు , రెవెన్యూ అధికారి అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలని హెల్త్ అసిస్టెంట్ల ధర్నా



కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న హెల్త్ అసిస్టెంట్లు

మహారాణిపేట: వైద్య ఆరోగ్యశాఖలో వివిధ తప్పుల వల్ల తమకు తీవ్ర అన్యాయం జరిగిందని, న్యాయం చేసి తమను ఆదుకోవాలని జిల్లా హెల్త్ అసిస్టెంట్లు కోరారు. ఈ మేరకు కలెక్టర్‌కు సోమవారం వినతిపత్రం సమర్పించారు. ప్రభుత్వ జీవో ప్రకారం 2002లో మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్ల (ఎంపీహెచ్‌ఏ) ఉద్యోగాల్లో చేరామని, జిల్లాలో ప్రస్తుతం 148 మంది పనిచేస్తున్నారని, ఇటీవల తమను ఉద్యోగాల నుంచి తొలగించారని అసోసియేషన్ అధ్యక్షుడు రాజేష్ అన్నారు. పోస్టుల రోస్టర్ కూడా సక్రమంగా చూపించలేదని, 148 మంది ఉంటే, వీరికి ఆర్‌వోఆర్ రోస్టర్ సక్రమంగా వేయలేదని, దీని వల్ల ఎంతో మంది ఉద్యోగులు రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు.

నాలుగు నెలలుగా జీతాలు చెల్లించకపోవడం అన్యాయం

- స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు న్యాయం చేయండి
- కలెక్టర్‌కు ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చిన ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ నాయకులు

మహారాణిపేట: గత నాలుగు నెలలుగా స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని, వేతనాల చెల్లింపులో ఉద్యోగులకు న్యాయం చేయాలని కోరుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కలెక్టర్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బోండా తాడన్న, బయ్యే మల్లయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్.సత్యనారాయణ ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం సమస్యను కలెక్టర్ హరేంధిర ప్రసాద్ దృష్టికి తెచ్చి చర్చించారు. జీతాలు అందక ఉక్కు ఉద్యోగులు అర్ధాకలితో బతుకుతున్నారని తెలిపారు. గత నాలుగు నెలలుగా జీతాలు ఇవ్వకపోవడంతో ఉద్యోగులు (ఎగ్జిక్యూటివ్, నాన్ ఎగ్జిక్యూటివ్) అనేక ఇబ్బందులు పడుతూ యాజమాన్యం నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలు సాధించేందుకు కృషి చేస్తున్నారన్నారు. జీతాలు లేక పిల్లల స్కూలు ఫీజులు, బ్యాంకుల దగ్గర తీసుకున్న లోన్లు కట్టలేక, నిత్యావసర ఖర్చులతో అనేక రకాలుగా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వెంటనే ఈ విషయం మీద జోక్యం చేసుకుని స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం నాలుగు నెలల జీతం చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన కలెక్టర్ హరేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ వెంటనే స్టీల్‌ప్లాంట్ యాజమాన్యాన్ని పిలిచి మాట్లాడి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఇదే సమస్యపై నగర పోలీస్ కమిషనర్‌కు, సెంట్రల్ లేబర్ కమిషనర్‌కు వినతిపత్రాలు సమర్పించగా పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కె.వి.రత్నం, దాసరి పుల్లారావు, ఎల్.వి.రమణ, వెంకట్ రాజు, పరమానంద, బి.సాయి, ఫణీంద్ర బాబు, ఆంజనేయ పాల్గొన్నారు.



సరికొత్తగా లేపాక్షి జంక్షన్

లేపాక్షి పేరు వినగానే గుర్తు వచ్చేది పెద్ద నంది విగ్రహమే. దానిని ప్రతిబింబిస్తూ లేపాక్షి కూడలిలో (లేపాక్షి దుకాణం ఎదురుగా) చూడముచ్చటగా నంది విగ్రహాన్ని, చుట్టూ వాటర్ ఫౌంటెన్ ఏర్పాటు చేశారు. జగదాంబ జంక్షన్ నుంచి సూపర్ బజార్ వెళ్లే మార్గంలో కూడలి ఆధునికీకరణ పనుల్లో భాగంగా దీనిని అభివృద్ధి చేశారు. చూడగానే ఇది లేపాక్షి జంక్షన్ అని గుర్తు పట్టేలా ఉన్న ఈ కూడలి నగరవాసులను ఆకట్టుకుంటోంది.

- ఏయూ క్యాంపస్

సీపీఎం మహాసభల్లో 35 తీర్మానాలు ఆమోదం



మహాసభల్లో ఆమోదించిన తీర్మానాలు చూపుతున్న సీపీఎం నాయకులు

దాబాగార్డెన్స్: సీపీఎం విశాఖ జిల్లా మహాసభల్లో 35 తీర్మానాలు ఆమోదించారని జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు తెలిపారు. సీపీఎం విశాఖ జిల్లా 24వ మహాసభలు ఈ నెల 28, 29న పెందుర్తి సుజాతనగర్‌లో విజయవంతంగా జరిగాయన్నారు. ఈ మేరకు సోమవారం యల్లమ్మతోటలో గల కార్యాలయంలో మీడియా సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు, జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బి.గంగారావు, ఆర్‌కేఎస్‌వీ కుమార్, వి.కృష్ణారావుతో కలిసి ఆమోదించిన తీర్మానాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జగ్గునాయుడు మాట్లాడుతూ పేదలకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు, ఇళ్ల పట్టాలు, పేదల పట్టాల రిజిస్ట్రేషన్ సమస్య పరిష్కారానికి ఉద్యమించాలని తీర్మానించినట్లు చెప్పారు. పంచగ్రామాలు, ఇనాం భూ సమస్య, స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయిస్తూ సెయిల్‌లో విలీనంతోపాటు ప్రభుత్వరంగ సంస్థల పరిరక్షణ, జిల్లా సమగ్రాభివృద్ధి, స్థానిక యువతకు పరిశ్రమల్లో 75 శాతం రిజర్వేషన్లు, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, అంతవరకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, అసంఘటితరంగ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, మహిళలపై లైంగిక దాడులు, హత్యలు అరికట్టాలని, నిరుద్యోగ యువతకు ప్రభుత్వ సంస్థల్లో కొలువులు కల్పించాలని, జిల్లా గ్రంథాలయాన్ని తక్షణమే నిర్మించాలని, ఆస్తి విలువ ఆధారిత పన్ను, యూజర్ చార్జీలు రద్దు చేయాలని, మెట్రో రైలుతోపాటు వాల్తేర్ డివిజన్‌తో కూడిన రైల్వే జోన్ పనులు ప్రారంభించాలనే తీర్మానాలను జిల్లా మహాసభ ఆమోదించిందన్నారు. ప్రజలను సమీకరించి భవిష్యత్‌లో ఉద్యమ కార్యాచరణ చేపడతామన్నారు. సామాన్యులపై విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా, అదానీతో చేసుకున్న ఒప్పందాలు రద్దు చేయాలన్న ఉద్యమాన్ని కొనసాగిస్తామన్నారు. జిల్లా కార్యదర్శిగా మరడాన జగ్గునాయుడు, కార్యదర్శి వర్గ సభ్యులుగా డాక్టర్ బి.గంగారావు, ఆర్‌కేఎస్‌వీ కుమార్, బి.పద్మ, కేఎం శ్రీనివాసరావు, బి.జగన్, పి.మణి, వి.కృష్ణారావుతోపాటు మరో 16 మందిని జిల్లా కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారని తెలిపారు.

సినీ కళాకారులకు అవార్డులు



సినీ కళాకారులకు అవార్డులు అందజేసిన కార్యక్రమంలో ప్రముఖులు

దాబాగార్డెన్స్: ఇండియన్ ఫిల్మ్ మేకర్స్ అసోసియేషన్ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ అవార్డుల కార్యక్రమం సోమవారం దాబాగార్డెన్స్‌లో గల అల్లూరి విజ్ఞాన కేంద్రం వేదికగా నిర్వహించారు. దేశం నలుమూలల నుంచి సినీ కళాకారులకు వివిధ కేటగిరీల్లో అవార్డులు అందజేశారు. ఐఎఫ్‌ఎంఏ నేషనల్ సెక్రటరీ పులగం రామచంద్రారెడ్డి, నేషనల్ ప్రెసిడెంట్ దిలీప్‌కుమార్ నేతృత్వంలో నిర్వహించిన కార్యక్రమంలో జాలాది విజయ, స్టార్ మేకర్ సత్యానంద్, నటుడు అంబటి శ్రీనివాస్, మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ పలువురు ప్రముఖుల చేతుల మీదుగా అవార్డులు అందజేశారు. పీఆర్ స్టూడియో డ్యాన్స్ గ్రూప్ పిల్లి పవన్‌కల్యాణ్ నేతృత్వంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అన్నమ్మ సేవ చారిటబుల్ ట్రస్ట్ పద్మజ క్లాసికల్ డ్యాన్స్, భవ్య సాత్వికల సోలో పెర్ఫార్మెన్స్ ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఐఎఫ్‌ఎం ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు డాక్టర్ కుమార్ నాయక్, ఉపాధ్యక్షురాలు డాక్టర్ పి.ఆశలత, కార్యదర్శి బాబు నెట్టి, కోశాధికారి మద్దిపల్లి రవళి, ఆర్గనైజింగ్ సెక్రటరీ మల్లేశ్వరి, యామిని, మోకాస మహాలక్ష్మి, లక్ష్మీ పూజ, మద్ది మంజీర, రెడ్డి సౌజన్య, మోని, భార్గవి, మూర్తి, డాక్టర్ లహరి తదితరులు పాల్గొన్నారు.

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ విక్రయిస్తే చర్యలు



ప్లాస్టిక్ ప్రత్యామ్నాయ వస్తువులు చూపిస్తున్న జెడ్సీ మల్లయ్యనాయుడు, తదితరులు

జగదాంబ: జనవరి ఒకటో తేదీ తర్వాత సింగిల్ యూజ్ ప్లాస్టిక్ విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని జీవీఎంసీ జోన్–4 కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు హెచ్చరించారు. నిషేధిత ప్లాస్టిక్ అమ్మకాలపై ప్లాస్టిక్ వ్యాపారులకు సూర్యాబాగ్‌లోని జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. జనవరి 1 తర్వాత వ్యాపారులు ప్లాస్టిక్‌ను విక్రయిస్తే అపరాధ రుసుము వసూలు చేయడంతో పాటు దుకాణాల లైసెన్స్ రద్దు చేస్తామని తెలిపారు. ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా పేపర్ ప్లేట్లు, గ్లాసులు, గన్ని బ్యాగ్‌లు విక్రయించాలని సూచించారు. చిరువ్యాపారుల వద్ద నిషేధిత ప్లాస్టిక్ కవర్లు కనిపిస్తే దుకాణాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. వినియోగదారులు కూడా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఏఎంహెచ్‌వో కృష్ణంరాజు, శానిటరీ సూపర్‌వైజర్ కిశోర్, ఇన్‌స్పెక్టర్లు, సెక్రటరీలు, వ్యాపారులు పాల్గొన్నారు.

పోక్సో చట్టంపై మహిళా కళాశాలలో వెబినార్

దాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో డబ్ల్యూఈసీ, ఎన్ఎస్ఎస్ సంయుక్త ఆధ్వర్యంలో 'స్టాప్ చైల్డ్ సెక్సువల్ అబ్యూజ్–పోక్సో యాక్ట్ 2012' పేరిట సోమవారం వెబినార్ నిర్వహించారు. రిసోర్స్ పర్సన్ వైశాలి రమేష్ విద్యార్థినులకు పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల మాట్లాడుతూ సామాజిక విషయాలపై అవగాహనతో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీవోలు డాక్టర్ కేఎల్ శిరీష, ఎస్.అనురాధ, డాక్టర్ జె.లావణ్య, డాక్టర్ బి.హైమావతి, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, కళాశాల విద్యార్థినులు పాల్గొన్నారు.